# దేవునితో నా దైనిక నడక
# 8

## దేవుని చిత్తం

భూమిమీద క్షేమకరమైన ఒకే స్థలం దేవుని చిత్తానికి నడుమనే ఉంది! "కాబట్టి మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి" (మత్తయి 6:33ఎ). రాజ్యము మొదటిగా వస్తుంది! "అయినను నా యిష్టము కాదు, నీ చిత్తమే ..." అని ప్రభువు ప్రార్థించాడు (మత్తయి 26:39బి); "దేవా, నీ చిత్తము నెరవేర్చుటకు ఇదిగో నేను వచ్చియున్నాను" (హెబ్రీ. 10:7; 9 వ. చూడు); "నీ చిత్తము పరలోకమందు నెరవేరు చున్నట్లు భూమియందును నెరవేరును గాక" (మత్తయి 6:10బి). మన మత సంబంధమైన నాగరికత ఆత్మ సంబంధమైన స్థితిని డామినేట్ చేస్తుంది అయినా దేవుని చిత్తాన్ని గూర్చి మాత్రం కొద్దిగానే చెప్పబడింది. మన అనుదిన స్వభావ లక్షణాలు మరియు మన కార్యాలు ఎంత శక్తివంతమైనవై ఉంటాయో కొద్దిమంది మాత్రమే గ్రహించగలుగుతారు. క్రైస్తవుడు తన "వృత్తిలో" లేని రోజు ఏదీ ఉండదు. దేవునితో జీవితం అంత సులభం కాదు, ఎన్నడు శాశ్వతమైయింది కాదు, ఎన్నడు ముగించబడేది కాదు. మనం పైకి ఎదుగుతూ వెళ్లాలి.

దేవుని చిత్తమునందు తమ యిష్టాన్ని పెంచుకోకుండ అనేకులు మత సంబంధంగా ఎందుకు పోరాడుతూ ఉంటారో? అపార్థాలవలననే:

(1) దేవుని చిత్తం మంచిది కాదని కొందరు అనుకుంటారు. తమ్మును సంతోషపరచేది ఏదో దాన్ని చేయాలని కోరుకుంటారు – దేవుని చిత్తం జరిగించడం పరితాపకరంగా ఉంటుందని వారు నమ్ముతారు. దేవుడు జీవితంలోనుండి సరదాను లేక తమాషాను తీసివేస్తాడని సాతాను మనకు బోధిస్తూ ఉంటాడు. నమ్మకత్వం ఆనందం లేమి అని అనేకమంది క్రైస్తవులు చెప్పుకుంటారు! అది ఎవరికి కావాలి? దేవుని చిత్తాన్ని కనుగొనే దానికి ముందుగా దేవుని కనుగొనాలి. దేవుని మంచితనాన్ని ఈ జీవితంలో చూడలేని క్రైస్తవుడు అంధుడు. మనకు సంభవించే అతి శ్రేష్ఠమైనవాటికి ఆయన ఆధారభూతుడు. దేవుని దేవుని గానే చూడు!

(2) రెండవ అపార్థం – "దేవుడు నా నిత్యజీవమునకైన బ్లూ ప్రింట్ కలిగియున్నాడు" అనేది. ఇది లేఖనానుసారమైనది కాదు సరిగదా, అది తెలివిగల ఆలోచన కూడా కాదు. దేవుడు "నడిపించే పనిలో" ఉన్నాడే గాని, "పటం పనిలో" లేదు. అబ్రాహాము ఎక్కడికి వెళ్లవలెనో ఎరుగకయే బయలువెళ్లాడు. యేసు ఒకే ఒక ఆజ్ఞను యిచ్చాడు: "నన్ను వెంబడించు." ఇది మన విశ్వాసం యొక్క దైనిక సాహసం. "నా జీవితం కొరకైన దేవుని చిత్తం ఏమైయుంది?" అనేది ప్రశ్న కాదు. "దేవుని చిత్తం ఏమైయుంది?" అనేది

ప్రశ్న. ఒకే ప్రత్యేకమైన విధానంలో నడిపించాలని దేవుడు శ్రద్ధ కలిగియుండలేదు. “నీ జీవితాన్ని నాకు సమర్పించు”మని ఆయన ప్రకటించాడు. మనం నడిపింపబడగోరే దానికన్న దేవుడు మనలను ఎక్కువగానే నడిపిస్తాడు. వ్రాత తిరిగి వ్రాయడానికి మనం పిలువబడలేదు, కాని మన పాత్ర ఏదో కనుగొని దాన్ని నింపడానికే పిలువబడ్డాం. మన యిష్టం నెరవేర్చుమని మనం దేవుని బలవంతం చేయడం కాదు. దేవుడు ఎక్కడ పని చేస్తున్నాడో కనుగొని ఆయన పనిలో భాగమై ఉండడానికి ప్రయత్నించు.

(3) దేవుని నడిపింపును గూర్చి జనులు భ్రమపడ్డారు. “దేవుడు నాతో చెప్పాడు” అని పలికిన ఒక వ్యక్తిని గూర్చి నేను విన్నాను. వారు ప్రవక్తలా? వారు దైవ ప్రేరేపితులా? సువార్తకు, మిషినెరీలుగా ఉండడానికి, సంఘ సామ్రాజ్యాలను నిర్మించడానికి పిలువ బడ్డారని ప్రజలు తప్పుగా ఆలోచించినప్పుడు ప్రళయమే సంభవిస్తుంది. మనలో ఎక్కువ మంది “సలహాదారుల అంతస్థులో” ఉండి దేవుని సేవ చేయాలని అనుకుంటాం. జీవితం మనకు కావలసిన వాటిని కోరుకునే కాఫీ హోటల్‌లాటిది కాదు. జీవితమంతా దేవుని ఆదిపత్యంలో ఉంది. మనం దేవుని పాదముల వద్దనే కాని ఆయన ప్రక్కన కూర్చుండము. బైబిల్లో దేవుని చిత్తం ఎంతగా కనుగొనగలమో ఆలోచించితే ఆశ్చర్యమేస్తుంది. బైబిలు మన శీలాన్ని గూర్చి, పరిశుద్ధతను గూర్చి; అది మనం ఎవరం అనేదాన్ని గూర్చి తెలుపుతుంది. దేవుని జ్ఞానము వివేచనకు తెలివికి, లేక తలాంతుకు కాక, శీలానికి సంబంధించింది. “అయితే పైనుండివచ్చు జ్ఞానము మొట్టమొదట పవిత్రమైనది, తరువాత సమాధానకరమైనది, మృదువైనది, సులభముగా లోబడునది, కనికరముతోను మంచి ఫలములతోను నిండుకొనినది, పక్షపాతమైనను వేషధారణయైనను లేనిదియునై యున్నది” (యాకోబు 3:17). పాలనుండి బలమైన ఆహారమునకు వెళ్లిన క్రైస్తవులు మేలు కీడులు ఎరుగునట్లు సాధకము చేయబడిన జ్ఞానేంద్రియములు గలవారైయున్నారు (హెబ్రీ. 5:11-14). మొదట లేఖనాల వద్దకు వెళ్లు! “నీ యెదుట నేను పాపము చేయకుండునట్లు నా హృదయములో నీ వాక్యము ఉంచుకొని యున్నాను” (కీర్తన. 119:11).

ఎక్కడ నివసించాలి, ఏ ఉద్యోగం చేయాలి అనేది బైబిలు చెప్పదు. దేవుడు తన కరుణాహస్తం ద్వారా కూడా నడిపిస్తాడు. ఏదో ఒకటి దేవుని చిత్తం కాకపోవచ్చు, అయినా అందులో ఆయన చిత్తం ఉంటుంది. ఆ చిత్తమేదో ఆయన మనలను తెలిసికోవాలని కోరతాడు. ఆయన చిత్తానికి లోబడడానికి ఆయన బలమిస్తాడు. “ఎవడైనను ఆయన చిత్తము చొప్పున చేయ నిశ్చయించుకొనినయెడల, ఆ బోధ దేవునివలన కలిగినదో, ... తెలుసుకొనును” (యోహాను 7:17ఎ). రోజుకు అయిదు నిమిషాలపాటైన దేవుని చిత్తాన్ని గూర్చి ఆలోచించేవారు మనలో ఎందరుంటారు? లోతుగా త్రవ్వు ... ప్రార్థించు ... ఆలకించు ... గమనించు. ప్రయాసపడేవారికి దేవుడు తన్ను బయలుపరచుకొంటాడు. నేడు ఏమి చేయవలెనని ఆయన నిన్ను కోరుతున్నాడో దాన్ని జరిగించకుండ నీవు రేపేమి చేయాలో ఆయన నీకు చూపునట్లు ఎదురు చూడకు!

# తువాలు (దాసుని రూపు)

## (యోహాను 13:1-17, 34, 35)

"మీరైతే ఆలాగు ఉండరాదు; మీలో గొప్పవాడు చిన్నవానివలెను, అధిపతి పరిచారకునివలెను ఉండవలెను. గొప్పవాడెవడు? భోజనపంక్తిని కూర్చుండు వాడా పరిచర్య చేయువాడా? పంక్తిని కూర్చుండువాడేగదా? అయినను నేను మీ మధ్య పరిచర్య చేయువానివలె ఉన్నాను" (లూకా 22:26, 27).

దేవుడు దాసులను మాత్రమే వాడుకుంటాడు! ఇతరులు దరఖాస్తులు పెట్టుకోనవసరం లేదు. నరుడు దేవునికి ఎంత సమీపంగా వెళ్లగలడో దాసుని హృదయం ఆయనకు అంత సమీపంగా వెళ్లగలదు. యేసు దాసుడైయున్నాడు! బైబిల్లో అనేక గొప్ప పదాలు పాడుచేయబడ్డాయి. "సిలువ" అనే పదాన్ని ఆలోచించు. ఒకప్పుడు అసహ్యమైన, క్రూరమైన, బాధాకరమైన, అవమానకరమైన, అనాగరికమైనది, యిప్పుడు కళాత్మకమైన, సువర్ణమయమైన, హానిలేనిదిగా ఉంది. నేడు ప్రజలు సిలువలేని క్రీస్తును కోరుతున్నారు. క్రీస్తును వెంబడించడమంటే సిలువ చెంతకు చేరాలి. ఆయన తన సిలువను భరించాడు మనం మనవాటిని భరించాలి. మృతిపొందాలని ప్రభువు మనకు ఆజ్ఞాపిస్తున్నాడు. సిలువ యొక్క అపాయాన్ని మరువరాదు (గలతీ. 5:11 చూడు). "ప్రేమ" అనే మాటను ఆలోచించు. ఈ మాట సెంటిమెంటల్ నాన్‌సెన్స్‌కు కుదించబడింది. దాన్ని దిద్దడానికి "కఠినమైన" అనేదాన్ని చేర్చాలి. "దాసుడు" అనే మాటను ఆలోచించు. వాస్తవానికి హక్కులు గాని, శక్తిగాని, రాజకీయాలు గాని లేని బానిస. అతడు సంపూర్ణంగా మరియొకని సొత్తు. దీన్ని వీర సాహసానికి మార్చి దాని భావానికి అర్థం లేకుండానే చేశాం. యేసు లోకానికి "తువాలు యొక్క విధానాన్ని" యిచ్చాడు. సంఘాలను కట్టడానికి దేవుడు ఉపయోగించే ఒకే సాధనం తువాలు చరిత్రలో ముందుగాని లేక అప్పటినుండిగాని యిది జరగలేదు. పైనున్న మార్గం క్రిందికి; కడపటివారు మొదటికి, జీవించడానికి చావు; పొందడానికి యివ్వు (మత్తయి 20:16; మార్కు 9:35). క్రీస్తునందు ప్రతిదీ "తల్లక్రిందులుగానే" ఉంది.

దేవుడు దాసులను మాత్రమే వాడుకుంటాడు – "సంఘపు పనివారిని" కాదు. "సంఘపు పనివారు" అనేది బైబిలు ప్రయోగం కాదు. మనమందరం దాసులుగానే గుర్తింపబడాలి. అయితే మనలో ఎవడును దాసుడుగా చూడబడను యిష్టపడడు. దాసులుగా ఉండడానికి జనులు బారులు తీరడంలేదు. దేవునిచేత ఉపయోగించుకో బడలేనంత చిన్నవాడవేమీ కాదు. కాని నీవు అతి పెద్దవాడవైయుండవచ్చు! చివరి సంపూర్ణమైన పాఠం ప్రభువైన యేసు యిచ్చినది "తువాలును గూర్చిన పాఠమే." తాను చేసిన దానిని వారును చేయాలని ఆయన వారికి ఉపదేశించాడు. ఆ పన్నిద్దరు తమ్మును

తాము హెచ్చించుకొన్నప్పుడు, ప్రభువు వారిని గద్దించాడు (మార్కు 10:35–45). క్రైస్తవులనేవారు సేవకులు, సేవయే క్రైస్తవులు చేసేది. "విజయవంతమైన సంఘం" అయ్యుండడానికి బదులు, "సేవ చేసే సంఘమైయుండాలి" అణకువకు తల్లి కృతజ్ఞత. అణకువ మనలను లోబరచుకునేవారిలా చేస్తుంది. ఇప్పుడు మనం దేవునితో దైనిక నడక యొక్క సారానికి దిగుతున్నాం: సేవకత్వం! మనం "తువాలు తీసికుందాం."

## గర్వపు మనస్సులు - మురికి పాదాలు

యోహాను 13 బహు వింతైన అధ్యాయం. నరుడు బైబిలును వ్రాయలేడు. అతడు వ్రాయగలిగితే దాన్ని అలా వ్రాయడు. చివరి రాత్రి భోజన సందర్భంలో యోహాను 13 యొక్క సెట్టింగ్ "మేడ పై గదిలో." మత్తయి, మార్కు, లూకాలు ప్రభురాత్రి భోజన ఏర్పాటును గూర్చి బయలుపరచారు. ఇది యోహాను 13లో లేదు. యోహాను యొక్క ప్రాధాన్యత "తువాలుకు" యివ్వబడింది. మత్తయి, మార్కు లూకాలలో తువాలు లేదు. జరిగిన సంభవాల యొక్క మానవ దృష్టిని, మరియు దేవుని యొక్క అరుదైన ప్రసన్నత దృష్టిని యిచ్చింది.

సిలువ యొక్క నీడ క్రిందనే "తమలో ఎవరు గొప్పవారు?" అని శిష్యులు వాదించు కొంటున్నారు. వారిలో బహుగా ప్రయోజనకరమైన అపొస్తలుడెవరు "MVA" (Most Valuable Apostle) వ్యక్తిగతమైన గొప్ప సంగతులను వెదుకవద్దని యిర్మీయా ఇశ్రాయేలీయులకు బోధించాడు (యిర్మీయా 45:5). నేర్చుకొనడానికి యిది కఠినమైన పాఠమే. యోహాను 13:1 దానినంతటిని తెలుపుతోంది: "... (యేసు) వారిని అంతము వరకు ప్రేమించెను" తన చిట్టచివరి ప్రేమ అంత్యపు దుఃఖాన్ని సహించింది. తన శిష్యులు సిలువ వద్ద ఆయనకు అవసరమై యుండగా, వారు వాదించుకుంటున్నారు. వారు గర్వంతో నిండియున్నారు. అయినా ఆయన వారిని ప్రేమించాడు. ఆయన వారిని తిట్టలేదు, వారివైపు తన వ్రేలిని చూపలేదు లేక, "అంతా క్రొత్త వారికొరకు" ఆయన దేవుని ప్రార్థించలేదు. "తండ్రీ, పెంతెకొస్తు దినం సమీపించింది, ఈ జనులలో మనం సంఘాన్ని ఎలా ప్రారంభిస్తాం?" అని ఆయన అనలేదు. పై చెప్పబడిన ఏ కార్యమూ యేసు చేయలేదు. వారి పాదములు కడగడానికి గాను ఆయన ఒక పళ్లెములో నీళ్లు తీసికొని ఒక తువాలును ఆయన తన నడుమునకు కట్టుకున్నాడు. నేను ఈ వర్ణనను చదువుతుండగా, "యేసూ, నీవు దాన్ని చేయకు, వారు నీ పాదాలు కడిగేలా చేసికో" అని నేను ఆలోచిస్తాను. మానవత్వం ఓడిపోయింది.

అయినా, దేవుడు ఓడిపోలేదు. 13వ అధ్యాయంలో ఆ రాత్రిని చూడ యోహాను వెనుకకు తిరిగాడు. యోహాను ఎంత సంపూర్ణంగా మారినవాడైయున్నాడు? వంగి తన మోకాళ్లమీద – శిష్యుల పాదాలను కడుగుతున్న యేసునందు – సర్వశక్తిగల దేవుని యోహాను తిలకించాడు! పాదాలు కడిగే ఆతిథ్యపు ఆచార మర్యాద కోరింది. హోదా కొరకు తగవులాడుకునే గర్విష్టులైనవారు ఆ పని చేయలేకపోగా, యేసు వారి పాదాలు కడిగాడు. దేవుడు దాసులను కోరుతుంటే మనుష్యులైతే "గొప్ప స్టార్‌లను" కోరు కుంటున్నారు. దేవుని దగ్గర గొప్పతారలకు తగిన చోటులేదు నీవు సేవ చేయడం

నిలిపినప్పుడు ఫిర్యాదు చేయ మొదలుపెడతావు! విమర్శకులు సేవచేయరు.

సేవకులు పాదాలు కడుగుతారు, ఆపు! ఎవరి పాదాలు కడగవచ్చు అని ఎన్నుకోరు. యేసు యూదా పాదాలు కూడా కడిగాడు. పాదాలు కడగడంలో భక్తి ఏమీలేదు. వ్రాయబడిన యూదులు మిష్నాలో – యూదుల పిల్లలు బానిసలుగా ఉండవచ్చును గాని పాదాలు కడిగేలా వారిని తక్కువ చూడకూడదని చెప్పబడింది. యేసు దాసులతో తన్ను గుర్తింపజేసికొనడం మాత్రమే గాక, దాసులలో అత్యంత అల్పులతో సమానంగా ఆయన తన్ను తానే చేసికొన్నాడు. రుజువు చేసికొనడానికి దాసులకు ఏమీ ఉండదు, వారు పోగొట్టుకునేది కూడా ఏదీ ఉండదు. యేసు తువాలుతో తన్ను కట్టుకున్నాడు. "నేను ఆయన దాసుడను గనుక నేను మీకును దాసుడనే అయ్యుండాలి" అనే సందేశాన్ని ఆయన ప్రదర్శించాడు. సిలువ వేయబడిన రక్షకుడు సిలువ వేయబడిన దాసులను మాత్రమే వాడుకోగలడు.

> రక్తము కారని సంఘము దీవించలేదు.
> సేవ చేయని సంఘము రక్షించలేదు.
> శ్రమపడని సంఘము విమోచించలేదు.
> చనిపోని సంఘము సజీవంగా ఉండలేదు.

## "పేతురు సూత్రము" [1]

శిష్యుల మానవత్వం గర్వములో వ్యక్తపరచబడింది! దేవుని దేవత్వము అణకువలో వ్యక్తపరచబడింది! ఇది పేతురులో స్పష్టంగా కన్పిస్తుంది. బైబిల్లో బొత్తిగా తెలివి తక్కువ ప్రశ్నను పేతురు అడిగాడు: "ప్రభువా, నీవు నా పాదములు కడుగుదువా?" (యోహాను 13:6బి). పళ్లెములో నీళ్లతోను తువాలుతోను వారి పాదాలను శుద్ధిచేసి కొంటూ వస్తున్నాడు. ఇప్పుడు పేతురు వంతు వచ్చింది. పేతురు ఈ ప్రశ్న ఎందుకు అడిగి యుంటాడు?

(1) పేతురుకు తప్పుడు భక్తి సమస్య ఉంది. ఇతరులకంటె అతడు యోగ్యుడై యున్నట్టు కనబడడానికి తంటాలు పడుతూ ఉండేవాడు. గర్వం వినయంలా కనబడడానికి ప్రయత్నిస్తుంది. ఇది పేతురు హృదయాన్ని బయలుపరచుతోంది. అతని పాదాలు కడగవలసిన అవసరత ఉన్నట్టు అతడు భావించలేదు! యేసు కేవలం మురికి పాదాలను మాత్రమే కడుగుతాడు. పేతురు నాయకుడు; తప్పులను అంగీకరించడానికి యిష్టపడడు. తన రూపు ప్రకాశించాలని కోరుకున్నాడు. మత సంబంధంగా "ప్రదర్శనలివ్వడం" అపాయకరం. పేతురు "తన్ను తానే బుద్ధిహీనునిగా" చేసికొన్నాడు. గర్వం ప్రజలకు ఎల్లప్పుడు యిలాగే చేస్తుంది. పేతురు పాదాలు మురికిగానే ఉండిపోయాయి; తక్కినవారి పాదాలకు కావలసినట్టే అతనికి అవసరముంది. మనకు గర్వపు స్వభావం ఉండవచ్చు. "నేను ధర్మం మీద బ్రదకడంలేదు" అని. అవును, నీవున్నావ్! మనమందరం ఉన్నాం. మన అందరి పాదాలు కడగబడవలసియుంది. "నా పాదాలు నేను కడుగుకొనగలను" అనేది పేతురు యొక్క స్వభావంలో మరియొక అవలోకనమైయుంటుంది. (స్వనీతి) మనలను బాధిస్తుంది, "క్రియలవలన రక్షణ" అనే తలంపు భయంకరమైనది. "నాకు ఎవరూ అవసరం లేదు" అని మనం అనుకోవచ్చు. అవును, నీవు అవసరమే! ప్రతి

ఒక్కరికి యేసు కావాలి. క్రైస్తవ్యమనేది "ఎలా చేయాలి" అనే మరొక మతం కాదు. క్రైస్తవ్యం "నీ పని నీవే చూచుకో" అనేది కాదు. "... నేనెప్పుడు బలహీనుడనో అప్పుడే బలవంతుడను" అని పౌలు నేర్చుకున్నాడు (2 కొరింథీ. 12:10). యేసు అవసరం లేకుండేలా మనం ఎన్నడు ఎదుగలేం. మనం ఆహారాన్ని వెదుకుతున్న భిక్షగాళ్లవంటివారం. తమ తప్పులు తెలియబడినప్పుడు సంఘాన్ని విడిచిపోవాలనే సహోదరులు ఆలోచనకు నేను ఆశ్చర్యపడతాను. మనమందరం పాపము చేసి దేవుడనుగ్రహించు మహిమను పొందలేనివారమై యున్నాం (రోమా 3:10, 23).

(2) యేసును "కాపాడడానికి" పేతురు ప్రయత్నించాడు. "గౌరవపదం" అనేది క్రొత్తది కాదు! రబ్బీలు కొన్ని స్థలాలకు వెళ్లరు, కొన్ని పనులు చేయరు, కొందరితో కలిసియుండరు. యేసు ఎన్నడే "రబ్బీల పాఠశాలకు" వెళ్లలేదు. ఆయన తన కుటుంబాన్ని, తన శిష్యులను, మరియు తన దేశాన్ని లేక జనాంగాన్ని నరాలు బిగబట్టే టెన్షన్‌లో పెట్టాడు. ఈ తువాలు యొక్క సంఘటన బహిరంగానికి వస్తే యేసు యొక్క గౌరవం మంట కలిసి పోతుందేమోనని పేతురు దృష్టిలో ఉన్నట్టుంది. దేవునికంటె ఎక్కువ భక్తిని కనుపరచడానికి ప్రయత్నించకు! తమ తప్పు భక్తితోను, దేవుడు కోరినదానికంటె ఎక్కువ నిష్ఠతోను ఉండాలని నన్ను భయపెడుతూ ఉంటారు. ప్రభువైన యేసు పాపుల యెడల దయ కలిగియున్నాడు; చిన్న బిడ్డలను ఆశీర్వదించాడు, సామాన్య జనులను ఆయన ఆలకించాడు. పాపులను మనం క్రీస్తులోనికి మార్చినప్పుడు, వారికి మనం ఈ హెచ్చరిక యివ్వాలి: "యేసును గూర్చి నీవు యిష్టపడని సంగతులను నీవు అంగీకరించి తీరాలి." మనం ప్రభువువలె మారవలసిందే గాని, ఆయన మనవలె మారడు. "దాసుడు" అనే దానికంటే పేతురు "సంఘపు పనివాడు" అనడానికి ఉదాహరణగా ఉంటాడు. ఆయన అదుపులోనే ఉన్నాడు. ఆయన అదుపులో ఉండడానికే యిష్టపడతాడు. బలవంతులు మాత్రమే వినయంగలవారై యుంటారు; క్షేమంగా ఉన్నవారు మాత్రమే సేవచేయగలరు. సమస్య శీలమేగాని, గౌరవం కాదు.

(3) పేతురు గర్వము ప్రదర్శించబడింది. నా గర్వం జయించబడిందని నేను అనుకున్నప్పుడు, దాని బలీయమైన తలను అది ప్రదర్శిస్తుంది. లేఖనాల్లో బాగా ఎరిగిన సంగతులను మనం ఎక్కువ శ్రద్ధతో చదవాలి. సంగతి యింతకు శిష్యులు యేసు పాదాలు కడగడం కాదు, యేసే ఆయన శిష్యుల పాదాలు కడగడమైయుంది! వారు ఆయన పాదాలు కడగడానికి స్వయంగా యిష్టపడి ముందుకు వచ్చేవారే. అది వారికి సమస్యగా ఉండేదికాదు. వాస్తవంగా, దానికొరకు పోరాడుకునేవారు కూడా. గర్వం బహు మోసయుక్తమయ్యింది. కొన్ని సంవత్సరాల తరబడి ప్రతి పరిచారకునికి ఒక "దాసుని తువాలు" యిస్తూ ఉండేవారం. ఇతర "తువాల దాసులను" చేయుడని మేము వారిని అడిగేవారం. వారు చేశారు. అప్పుడప్పుడు, మాకు "తువాలు ఆదివారం" ఉండేది. ప్రత్యేకమైన దాసులకు తువాళ్లు యివ్వబడుతూ ఉండేవి. ఇది నమ్మశక్యం కానిదైయుంది. తమ తువాలులను సంపాదించుకొనడానికి జనులు రాజకీయాలను ఉపయోగించు కునేవారు, తువాలుల విషయంలో పోరాటం సాగించారు, వారు తువాలులను ప్రదర్శించారు. తువాలు వెనుకనున్న ఉద్దేశాన్ని గర్వం నాశనం చేసింది!

వచ్చే ఆదివారం పెద్దలు నీ పాదాలు కడుగుతామని ప్రకటించితే నీవు ఏమి

చేయబోతావు? నీవు క్రొత్త సూటును, క్రొత్త బూటును, క్రొత్త టైని నీవు కొంటావా? నీవు స్నానం చేసి, నీ కుటుంబాన్ని నీ స్నేహితులను తోడుకొని వస్తావ్! నీవు దాన్ని నాశనం చేస్తావ్! గర్వం! ఒక ఆదివారం వారు నిన్ను ఆశ్చర్యపరిచారే అనుకో? వారు నీ షూని తీసివేసినప్పుడు, నీ మేజేళ్లలో రంధ్రం వారు కనుగొనవచ్చు. నీవు అవమానపరచ బడతావా? గర్వం! అది పేతురులో ఉంది; అది మనలో కూడా ఉంటుంది.

(4) పేతురు తన్ను తాను తగ్గించుకొని, మారుమనస్సు పొందాడు. "ప్రభువా, నా పాదములు మాత్రమేగాక నా చేతులు నా తలకూడ కడుగుమని ఆయనతో" చెప్పాడు (యోహాను 13:9). మనకు పేతురు ఉదాహరణ అవసరం. అతడు పాపం చేశాడు, అవును, అయితే అతడు మారుమనస్సు కూడా పొందాడు. మరియొకని పాదాలు కడగడం నీ స్వాతంత్ర్యాన్ని ప్రకటించడం కావచ్చు; నీ పాదములు కడగబడడం నీవు ఆధారపడిన స్థితిని ప్రకటిస్తుంది. సేవ చేయడం కంటె సేవ చేయించుకొనడం కష్టం. తల్లిదండ్రులారా, మీ పిల్లలు మీకు సేవ చేయనియ్యండి! బలవంతులైన సహోదరులారా, సహోదరులు మీకు యివ్వనియ్యుడి.

"చాలనితనం అనే వరం" అని నేను దీన్ని పిలుస్తాను. ప్రసంగించడానికి గాని, సేవ చేయడానికి గాని తగిన హక్కును మనలో ఎవడును సంపాదించుకోలేదు. పెంతెకొస్తు దినాన గొప్ప ప్రసంగం చేసింది ఎవరు? పేతురు! అతడు హక్కును సంపాదించుకున్నాడా? లేదు! ప్రసంగపు పరీక్షలో అందరికంటె ఎక్కువైన గ్రేడ్ పొందాడా? లేదు! చివరి రాత్రి భోజనంలో పేతురు ప్రభువుచే తన పాదాలు కడగ నిష్టపడ్డాడు గనుక పెంతెకొస్తు దినాన ప్రసంగించేలా దేవుడు అతనికి కృప ప్రసాదించాడు! ప్రసంగించడానికి నేనెవడిని? నేను ఎవడినే కాను! నేను ఉండతగను! ఏదియెలాగున్నా, నన్ను నేను తగ్గించుకొని యేసు నా పాదాలు కడుగను సమ్మతించునంతవరకు, నేను ఎవరికైనా, ఎక్కడైనా, ఎప్పుడైనా ప్రసంగించవచ్చు. ఇక్కడ విశేషమేమంటే: యేసు పాదములు కడిగినప్పుడు హృదయాలను పవిత్రపరచుతాడు! యేసు మాత్రమే మనలను యథార్థవంతులుగా నిలుపగలడు! మనము "తువాలు యొక్క క్రమానికి" యిష్టపడాలి.

పేతురును తక్కిన శిష్యులును "చాలినతనం అనే వరాన్ని" గూర్చి నేర్చుకొని దానిని పొందవలసియుంది. చిన్నపిల్లలు చెడ్డ పటాలను చిత్రించలేరు. వారు లైను లోపల రంగు కొట్టలేరేమో కాని పిల్లలు పిల్లలయ్యే ఉంటారు. మనం వారిని కౌగలించుకుంటాం, వందనాలు చెప్తుతాం, వారు రంగులు వేసిన కాగితాలను భద్రంగా ఉంచుతాం. దేవుని విషయంలోను మన విషయంలోను యిలాటిదే రైటైయుంటుంది. మనం పరిపూర్ణులమై యుండలేం, ప్రతిదీ రైటుగా చేయలేం; మనం తప్పిపోడాన్ని తప్పించుకోలేం. పిల్లలు ఎదగడం నేర్చుకునేది యిలాగే. యేసు మన పాదాలను కడిగినప్పుడు, పడిపోడానికి మనం సమ్మతించబడ్డాం! మంచిగా చేయలేకపోయినందున అనేకులు సేవ చేయడానికి నిరాకరించవచ్చు. నీవు విజయవంతంగానే ఉండనక్కరలేదు నీవు నమ్మకమైన వాడవుగా ఉండాలి. నీవు ఎక్కడ ఉన్నావో అక్కడ, నీకు ఏమి ఉందో దానితో, నీవు చేయగలిగింది చేయి. ఇతరులు ఏమి చేసినా సరే, పేతురుకు పేతురే బాధ్యుడు. మనం దేవుని సేవించడం మీద రక్షణ ఆధారపడదు; కాని దేవుడు మనకు సేవ చేసేలా అనుమతించడం మీద ఆధారపడియుంటుంది. యుద్ధము యెహోవాదే. శక్తి ఆయన సందేశంలో ఉంది. నిజమైన

దేవుని సేవకులై ఉండడానికి గాను, దేవునిచే మనం పరిచర్య చేయబడాలి. ఇతరులను మనం ఎలా ట్రీట్ చేస్తామో – అలాగే దేవుడు మనలను ట్రీట్ చేస్తాడు.

## "నావలె ఉండు"

తాను చేసినట్టే చేయుడని ప్రభువు తన శిష్యులకు తెలిపాడు (యోహాను 13:13–17). యేసు ఒకే ఒక ఆజ్ఞ యిచ్చాడు: "నన్ను వెంబడించు"మని (మత్తయి 4:19; 9:9; 1 పేతురు 2:21). క్రైస్తవ్యం క్రీస్తుదైయుంది. "నేను క్రీస్తును పోలి నడుచుకొనుచున్న ప్రకారము మీరును నన్ను పోలి నడుచుకొనుడి" అని పౌలన్నాడు (1 కొరింథీ. 11:1). తన్ను అనుసరించుడని అతడు మొండిగా ఫిలిప్పీయులతో చెప్పాడు (ఫిలిప్పీ. 3:17). అప్పుడు తన జీవితాన్ని ఆత్మను వారికి తెరచియుంచాడు: "మరియు మీరు నావలన ఏవి నేర్చుకొని అంగీకరించితిరో, నాయందున్నట్టుగా ఏవి వింటిరో ఏవి చూచితిరో, అట్టివాటిని చేయుడి; అప్పుడు సమాధాన కర్తయగు దేవుడు మీకు తోడైయుండును" (ఫిలిప్పీ. 4:9). గత కొన్ని సంవత్సరాలుగా నేను సహోదరుల ఎదుట నిలిచి "నన్ను వెంబడించుడి" అని అంటున్నా. నేను ఏభై సంవత్సరాలు ప్రసంగించాను – ఇది చెప్పకముందు ఎంత కాలం నేను ప్రసంగించవలసి ఉంటుంది? పెద్దలు మంద యెదుట నిలబడి "మమ్మును వెంబడించుడి" అని చెప్పాలి. తల్లిదండ్రులు బిడ్డలతో "మమ్మును వెంబడించుడి" అని చెప్పాలి. మీకు ముందు వారే రియాక్ట్ ఔతారు! గొర్రెలు వెంటాడతాయి. మన బాధ్యత వారిని సరియైన మార్గంలో నడిపించడం. యేసుతో మనం కాలం గడిపిన వారమని మనతో ఉన్నవారికి అర్థం అయ్యిందా? పేతురు యోహానులు చుట్టునున్నవారు "వారు యేసుతోకూడ ఉండినవారని గుర్తెరిగిరి" (అపొ. 4:13). మీ ప్రీచర్స్‌ని దాసులలోనుండి ఏరుకొనండి. మనం క్రీస్తు సేవకులమైతే, మన పిల్లలు – సహోదరులు – మనకు "కాదు" అని చెప్పలేరు.

## వచ్చి, నాతో నడువుము.

> "ప్రభువు యొక్క దాసుడు అట్టివారిని సాత్వికముతో శిక్షించుచు, జగడమాడక అందరి యెడల సాధువుగాను బోధింప సమర్థుడుగాను, కీడును సహించువాడుగాను ఉండవలెను" (2 తిమోతి 2:24, 25ఎ).

సూచన

[1]Peter illustrates the humanity of the disciples, and this major point captures that idea. However, the phrase comes from the name of Laurence F. Peter's theory that an employee within an organization will advance to his or her level of incompetence and remain there.